సాక్షి సంగారెడ్డి

బుధవారం । 9 । అక్టోబర్ । 2024



మూఢ నమ్మకాలపై చైతన్యం

మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జన విజ్ఞాన వేదిక తెలిపింది.

వివరాలు 2లో ▸



ముగిసిన 'బ్యాగ్‌లెస్ డే'

విద్యార్థులలో ఒత్తిడిని తగ్గిస్తూ కొనసాగిన వర్గల్ నవోదయ విద్యార్థుల ఐదు రోజుల బ్యాగ్‌లెస్ డే కార్యక్రమం ముగిసింది.

వివరాలు 2లో ▸

న్యూస్‌రీల్

మహా'లక్ష్మి'దేవిగా..

రూ.6లక్షల కరెన్సీ నోట్లతో అలంకరణ



మహాలక్ష్మి అలంకరణలో దుర్గామాత

సంగారెడ్డి జోన్: విజయదశమిని పురస్కరించుకుని దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. కందిలోని బాలాజీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న విజ్ఞాన్ కాలనీలో మంగళవారం రూ.6లక్షల కరెన్సీతో మహాలక్ష్మి దేవిగా దుర్గామాతకు ప్రత్యేక అలంకరణ చేశారు.

నేడు నియామక పత్రాలు అందజేత

సంగారెడ్డి ఎడ్యుకేషన్: డీఎస్సీ–2024లో భాగంగా నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులకు బుధవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయనున్నట్లు డీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా నుంచి 397 మంది అభ్యర్థులు ఉపాధ్యాయులుగా నియామకమయ్యారని, వీరిలో ఎస్‌జీటీ 285, ఎస్‌ఏ 91, లాంగ్వేజీ పండిట్‌లు 15, పీఈటీలు ఆరుగురు ఉన్నారని పేర్కొన్నారు. వీరందరికి హైదరాబాద్‌లో నియామక పత్రాలను అందుకునేందుకు వెళ్లడానికి ప్రత్యేకంగా 10 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. నారాయణఖేడ్‌లో ఆర్డీఓ కార్యాలయం, అందోల్‌లో జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర), సంగారెడ్డిలో స్టేడియం గ్రౌండ్, పటాన్‌చెరువులో ఎంపీడీఓ కార్యాలయం, జహీరాబాద్‌లో బాగారెడ్డి స్టేడియం వద్ద ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు నియామకపత్రాలు అందుకునే అభ్యర్థులు తమకు అనుకూలమైన ప్రదేశాలకు ఉదయం 8 గంటల వరకు చేరుకోవాలని డీఈవో విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధికి ఆటంకం వద్దు

జెడ్పీ సీఈవో జానకి రెడ్డి




కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈవో జానకి రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. హరితహారం, ప్రజా పాలన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను ఆటంకం లేకుండా కొనసాగించాలని సూచించారు. ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులపై పర్యవేక్షణ చేయాలని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీఓ దయాకర్ రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా ముడుపులు తీసుకెళ్లారా..?

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముడుపులు తీసుకొని వెళుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించడం తగదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..2004లో యూపీఏ మంత్రివర్గంలో ఉన్న కేసీఆర్ కూడా ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా ముడుపులు తీసికొని వెళ్లారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వరదల వల్ల సుమారు రూ.11వేల కోట్ల నష్టం జరిగిందని, నష్టపరిహారం ఇచ్చి ప్రజలను ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేటీఆర్ అహంకార పూరితమైన మాటలను ఆపాలని, లేదంటే తెలంగాణలో తిరగకుండా కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకుంటారని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సామయ్య, పట్టణ ఉపాధ్యక్షులు యువరాజ్ మోరే తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ విధానంలో జరుగుతున్న ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం ఉదయం ఇంటర్మీడియెట్ అభ్యాసకులకు అర్థశాస్త్రం పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 182 మందికి గాను 130 మంది అభ్యాసకులు, మధ్యాహ్నం జరిగిన ఇంటర్ జీవశాస్త్రం పరీక్షకు 14 మందికి గాను 11 మంది హాజరయ్యారు. పదో తరగతి అభ్యాసకులకు హోమ్ సైన్స్ పరీక్ష జరగగా, 14 మందికి గాను 9 మంది హాజరయ్యారు.



బతుకమ్మ వేడుకల్లో అధికారులు

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

సంగారెడ్డి జోన్: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో టీఎన్జీవో ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యాలయ మహిళా అధికారులు ఆడిపాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజారాణి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీకాంత్, కోశాధికారి వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మానాన్నల మాట.. సివిల్స్‌కు బాట



టర్నింగ్


కలెక్టర్ వల్లూరు క్రాంతి

ప్రజాసేవ చేయడానికి నాన్న నడిపిన బాట.. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవాలని అమ్మచెప్పిన మాట నన్ను ఐఏఎస్ చదివేలా చేశాయి. మాది వైద్యుల కుటుంబం అయినప్పటికీ చిన్నతనం నుంచి ప్రజాసేవ చేయాలని అనుకున్నా.. దాన్ని గుర్తించిన తల్లిదండ్రులు.. వారి ప్రోత్సాహం నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. మూడోసారి మెరుగైన ర్యాంకుతో ఐఏఎస్ అయ్యాను. ఎన్ని ఓటములు ఎదురైనా సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి చెప్పుకొచ్చారు. మంగళవారం ఆమె సాక్షితో ముచ్చటించారు. తన కుటుంబం, విద్యాభ్యాసం, వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారామె. –సంగారెడ్డి జోన్

వివరాలు 2లో ▸

పండుగ పూట.. ధరల మంట

- నింగినంటిన నిత్యావసరాలు
- కుతకుత ఉడుకుతున్న కూరగాయలు
- సామాన్యుడి నెత్తిన 'ధరా'ఘాతం



కల్హేర్(నారాయణఖేడ్): బతుకమ్మ, దసరా పండుగలు వచ్చాయంటే ఎక్కడెక్కడో ఉన్న వారు సొంతూళ్లకు చేరుతుంటారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా గడపాలనుకుంటారు. అయితే పండుగల మీద ధరల ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్ తదితర మార్కెట్‌లు, జిల్లాలోని వారంతపు సంతల్లో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు అడ్డగోలుగా పెరిగాయి.

వ్యాపారుల హవా

కూరగాయల విక్రయాల్లో వ్యాపారులు, దళారుల హవా నడుస్తోంది. ఆరు గాలం శ్రమించి పండించిన రైతన్నకు మద్దతు ధర లభించడంలేదు. వారు నిర్ణయించిన ధరకు కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో ధరలు పెరిగిన రైతన్నకు మేలు జరగడం లేదు. సామాన్య ప్రజలపై మాత్రం ధరల భారం పడుతోంది.

కూరగాయల ధరలిలా

జిల్లాలో కూరగాయల ధరలు మండుతున్నాయి. టమాటా కిలో రూ. 50 నుంచి రూ. 80కి ఎగబాకింది. బీరకాయ కిలో రూ. 100, బెండకాయ రూ. 60, చిక్కుడు రూ. 80, వంకాయ రూ. 80, పచ్చి మిర్చి రూ. 50 అమ్ముతున్నారు. అల్లం వెల్లుల్లి రూ. 200లకు విక్రయిస్తున్నారు. అలాగే మాంసహారం ధరలు కూడా పెరిగాయి. కిలో చికెన్ రూ. 240 నుంచి 260లు కాగా, కిలో మటన్ ధర రూ. 700 నుంచి 780 వరకు చెబుతున్నారు. ఇలా పప్పులు, వంట నూనెల ధరలు భగభగ మండుతున్నాయి.

కొనడం కష్టంగా ఉంది



కూరగాయల ధరలు బాగా పెరిగాయి. రేటు అనే మాట వింటేనే సామాన్య ప్రజలు హడలెత్తిపోతున్నారు. టమాటా, ఉల్లిగడ్డలు, అల్లం, ఎల్లిగడ్డలు, నిత్యావసరాల పెరగడంతో కొనడం కష్టంగా ఉంది. ధరల పెరుగుదలను అదుపు చేసేందుకు ప్రభుత్వం దృష్టి పెట్టాలి.

– గాయత్రి, మాసాన్‌పల్లి ఎక్స్‌రోడ్, కల్హేర్ మండలం

కిలో వంట నూనె రూ.150లు



నిత్యావసరాల ధరలు పెరిగాయి. నెల రోజుల క్రితం రిటైల్ షాపుల్లో రూ. 120 ఉన్న మంచి నూనె ప్యాకెట్ ధర రూ. 150కు చేరింది. ఇతర వస్తువుల ధరలు పెరగడంతో ఇబ్బందిగా ఉంది. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సాయిలు, మార్డి, కల్హేర్ మండలం

ఓటరుగా నమోదు చేసుకోండి

ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సంగారెడ్డి జోన్: అర్హులైన ప్రతి ఉపాధ్యాయులు, పట్టభద్రులు మరోసారి కొత్తగా తమ ఓటుగా నమోదు చేసుకోవాలని ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతితో పాటు జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు జాబితా రూపకల్పన నిబంధనల మేరకు చేయాలని ఆదేశించారు. నవంబర్ 6వ తేదీ లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. డిసెంబర్ 9వ తేదీలోపు డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. డిసెంబరు 25లోపు అభ్యంతరాలను పరిష్కరించి, 30న తుది జాబితా ప్రకటించాలని సూచించారు. నిబంధనల మేరకు ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, ట్రైనీ కలెక్టరు మనోజ్, ఆర్డీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోషకాల గని డ్రాగన్ ఫ్రూట్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

- జిల్లాలో 300 ఎకరాల్లో సాగు
- కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీరజ
- ఎఫ్‌ఆర్‌ఎస్‌లో అవగాహన సదస్సు

సంగారెడ్డి : డ్రాగన్ ఫ్రూట్ (కమలం పండు) పోషకాల గని అని తెలంగాణ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని (ఎఫ్‌ఆర్‌ఎస్) ఫల పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన డ్రాగన్ ఫ్రూట్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా 32 రకాల డ్రాగన్ ఫ్రూట్స్‌తో ఏర్పాటు చేసిన మేళాను ప్రారంభించి వివిధ రకాల పండ్లను, డ్రాగన్ ఫ్రూట్స్‌తో తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. 1990లో డ్రాగన్ ఫ్రూట్ ను రైతులకు పరిచయం చేసి సాగును ప్రారంభించామన్నారు. ఎన్నో సాధక బాధకాలను ఎదుర్కొని పంటను రైతులకు చేరువ చేశామని పేర్కొన్నారు. రైతులే పరిశోధకులుగా మారి అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. సంగారెడ్డి జిల్లాలో 300 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు అవుతుందన్నారు. రోగ నిరోధక శక్తి పండ్లు, కూరగాయల్లో ఎక్కువగా ఉంటుందన్నారు. మంచి యాజమాన్య పద్ధతులను పాటిస్తూ, నిపుణులైన రైతులు హార్టికల్చర్ అధికారుల సలహాలు తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వం కూడా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాన్ని ఇస్తుందని తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తాను ప్రభుత్వ ఉద్యోగం పదేళ్లు చేశానని, రాజీనామా చేసి వ్యవసాయంపై ఉన్న మక్కువతో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేసేందుకు ముందుకొచ్చానన్నారు. టీఎన్నార్ ఫ్రూట్స్ అధినేత ఔత్సాహిక రైతు రమేశ్ రెడ్డి మాట్లాడుతూ.. 2015 నుంచి వంట సాగు చేస్తున్నానని పంట పండించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు ఎదురయ్యే సవాళ్ల గురించి విపులంగా వివరించారు. ముందుగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. హార్టికల్చర్ అధికారులు డాక్టర్ సుచరిత, డాక్టర్ లక్ష్మీనారాయణ, మౌనిక నితీష్, మాధవి, రైతులు పాల్గొన్నారు.

గోల్డెన్ కావవి.. గోల్‌మాల్ గ్యారంటీలు

గాడి తప్పిన రేవంత్ పాలన

- పండుగ పూట అన్ని వర్గాలు పస్తులు
- కాంగ్రెస్ మోసాలపై పల్లెల్లో చర్చ పెట్టండి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: 'సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల గోల్డెన్ గ్యారంటీలు అని పొగడడం హాస్యాస్పదంగా ఉంది. అవి అచ్చంగా గోల్‌మాల్ గ్యారంటీలు. కాంగ్రెస్ గోబెల్స్ గ్యారంటీలు' అని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ పాలన గాడి తప్పిందని, హైడ్రా వల్ల హైదరాబాద్ కల తప్పిందన్నారు. రాజకీయ భాష కట్టు తప్పిందని, అవినీతి అదుపు తప్పిందని, రియల్ ఎస్టేట్ కుదేలు అయిందని, మొత్తంగా తెలంగాణ బతుకు బండి పట్టాలు తప్పిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో బతుకమ్మ, దసరా పండుగలను ఆనందంగా జరుపుకోవాల్సిన ప్రజలు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వల్ల పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాలన గాడి తప్పడం వల్ల అనేక వర్గాలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఆశ , అంగన్వాడీ వర్కర్లు, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, గెస్ట్, పార్ట్ టైం లెక్చరర్ల జీతాలు రాక పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. మూసీ సుందరీకరణ కోసం లక్షన్నర కోట్ల ఖర్చు చేస్తామని చెబుతూ ఇచ్చే రెండు వేల పింఛను కూడా ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులు మెస్ ఛార్జీలు రాక నీళ్ల చారుతో అన్నం తింటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చిన్నపాటి మందులు కూడా దొరకడం లేదన్నారు.

యువత ప్రజలతో చర్చ పెట్టాలి..

గత ఏడాది దసరా సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నమ్మి తమ భవిష్యత్ కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని పండుగలకు వచ్చిన యువత గ్రామాల్లో ప్రచారం చేసిందని, కానీ ప్రస్తుతం పరిస్థితి రివర్స్‌గా ఉందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ దసరాకు ఊర్లకు వస్తున్న యువత కాంగ్రెస్ చేసిన మోసాన్ని కుటుంబ సభ్యులకు, గ్రామ ప్రజలకు వివరించి చెప్పాలని కోరారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

- కుమ్మరులను బీసీ 'ఏ'లోకి మార్చాలి
- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కుమ్మరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని అఖిల భారత కుంభార్ (కుమ్మరి) ప్రజాపతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో రాష్ట్రస్థాయి కుమ్మరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దరిపల్లి చంద్రం మాట్లాడుతూ కుమ్మరులు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కుమ్మరులకు టికెట్లు కేటాయించాలన్నారు. కుమ్మరులను బీసీ'బీ' నుంచి బీసీ'ఏ' లోకి మార్చాలని, గెజిట్లో ప్రజాపతి అనే పదాన్ని చేర్చి ఆత్మగౌరవం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

భవిష్యత్ బీజేపీదే..

- ఫాంహౌస్‌కే పరిమితమైన కేసీఆర్
- పది నెలల్లోనే అభాసుపాలైన కాంగ్రెస్ సర్కార్
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తెలంగాణలో భవిష్యత్ బీజేపీదేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌కు చెందిన మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బుద్ధ జ్యోతిమహేందర్, చాట్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ దేశాయిరెడ్డితో పాటు ఇతర గ్రామాలకు చెందిన కార్యకర్తలు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్లలో ఎన్నో అక్రమాలు, అవినీతికి పాల్పడిందన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే అభాసుపాలైందని విమర్శించారు. బీజేపీలో పైరవీలు ఉండవని, కష్టపడి పనిచేసే వారికే గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రతిపక్ష నేతగా ప్రజల్లో ఉండాల్సిందిపోయి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని అన్నారు. హరియాణాలో బీజేపీ గెలవడంతో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాంరెడ్డి, గురువారెడ్డి, వెంకటరమణ, మండల అధ్యక్షుడు ఐలయ్యయాదవ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు ఉమ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ జీతం.. డబుల్ డ్యూటీ

- టిమ్ డ్రైవర్ల పరిస్థితి అధ్వానం
- టార్గెట్ అందుకోకుంటే కమీషన్ కట్
- ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు

టిమ్ డ్రైవర్లతో డబుల్ డ్యూటీ చేయిస్తున్నారు. వారే టికెట్ ఇస్తారు. ఒక్కో ప్రయాణికుడిపై కొంత కమీషన్‌ను ఆర్టీసీ సంస్థ చెల్లిస్తోంది. కానీ వారి పరిస్థితి సింగిల్ జీతం, డబుల్ డ్యూటీ అన్నట్లుగా ఉంది.

మరో వైపు టార్గెట్ అందుకోలేకపోయారని ఇచ్చే కమీషన్‌ను ఉన్నతాధికారులు కట్ చేస్తున్నారు. దీంతో టిమ్ డ్రైవర్లు తలలు పట్టుకుంటున్నారు. మెదక్ ఆర్టీసీ టిమ్ డ్రైవర్ ఎల్లస్వామి.. ఈనెల 2న సూపర్ లగ్జరీ బస్సు తీసుకుని శ్రీశైలం వెళ్లి వచ్చాడు. ఆరోజు గాంధీ జయంతి కావటంతో టార్గెట్ అందుకోలేకపోయాడు. దీంతో అధికారులు అతనికిచ్చే కమీషన్ కట్ చేశాడని వాపోయాడు.



మెదక్‌జోన్: జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌లలో రెండు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వాటిలో మొత్తం 136 బస్సులు ఉంటే 58 అద్దె బస్సులు, 12 ఎక్స్‌ప్రెస్‌లు, 19 డీలక్స్‌లు, 2 సూపర్ లగ్జరీలతో పాటు 45 పల్లె వెలుగు బస్సులున్నాయి. వాటిలో పల్లె వెలుగులతో పాటు ఎక్స్‌ప్రెస్‌లను మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ఉపయోగించగా 19 డీలక్స్‌లు, 2 సూపర్ లగ్జరీలను మాత్రం టిమ్ డ్రైవర్లు నడుపుతున్నారు.

టిమ్‌డ్రైవర్‌కే కండీషన్లు

సాధారణంగా ఏ శాఖలో అయినా నియమించిన ఒక ఉద్యోగాన్ని మాత్రమే చేస్తారు. కానీ ఆర్టీసీలోని డ్రైవర్ల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. టిమ్‌లు అప్పగించి రెండు డ్యూటీలు చేయాలని కండీషన్లు పెడుతున్నారు. టార్గెట్ రాలేదని ఒక్కో టికెట్‌పై వారికి ఇచ్చే రూ. 1 కమీషన్ సైతం ఇవ్వకుండా మానసికవేదనకు గురి చేస్తున్నారు. మెదక్ నుంచి తిరుపతి, శ్రీశైలం లాంటి దూరప్రాంతాలకు వెళ్లి రావాలంటే రెండు రోజుల సమయం పడుతుంది. ఈ రెండు రోజుల పాటు ఒక వేళ కండక్టర్ విధులు నిర్వహిస్తే అతనికి రూ. 2,500 నుంచి 3 వేల వరకు ఆర్టీసీ సంస్థ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఖర్చుల నుంచి తప్పించేందుకే టిమ్ డ్రైవర్లను నియమించారు. కానీ టార్గెట్ అందుకోలేదని కమీషన్ కట్ చేస్తుండటం ఎంతవరకు సమంజసమని మిగతా డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు.

మూడు రోజులపాటు సమ్మె

రెండు మాసాల క్రితం మెదక్ డిపోలో డ్రైవర్లు మూడు రోజులపాటు సమ్మె చేశారు. వారం అంతా డ్యూటీలు చేయించి, నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన ఓటీలను ఇవ్వక పోవటంతో ఆరోగ్యం దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉన్నతాధికారులు వారి సమస్యను పరిష్కరిస్తామని హామీనివ్వడంతో సమ్మె విరమించి విధుల్లో చేరారు. నేటికీ వారి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొంటున్నారు.

ఓటీలు ఇవ్వకుండా..



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మెదక్ డిపోలో అధికారుల వేధింపులకు గురి చేస్తున్నారు. ఓటీలు ఇవ్వకుండా రోజూ డ్యూటీలు చేయిస్తున్నారు. టిమ్ విధులు నిర్వహించే డ్రైవర్లు టార్గెట్ తీసుకు రాలేదనే సాకుతో కమీషన్ కట్ చేస్తున్నారు.

– లాల్, టిమ్‌డ్రైవర్ మెదక్ డిపో

నిబంధనలు అతిక్రమిస్తేనే చర్యలు

షెడ్యూల్ ప్రకారం బస్సులను నడపాల్సి ఉంటుంది. నిబంధనలు అధిగమిస్తేనే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటాం. లేకుంటే ఎట్టిపరిస్థితుల్లో డ్రైవర్ల కమీషన్ కట్ చేయబోం.

– వీరబాబు, ఆర్టీసీ సీఐ మెదక్ డిపో

క్లుప్తంగా

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుల ఎన్నిక


ఊడెం వేమారెడ్డి


పవన్‌రాజ్

గజ్వేల్ /జిన్నారం(పటాన్‌చెరు): పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా గజ్వేల్ పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఊడెం వేమారెడ్డి, జిన్నారం నుంచి పవన్ రాజ్ (వావిలాల), మొగిలయ్య (కొడకంచి) ఎన్నికయ్యారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలో నిర్వహించిన సమావేశంలో వీరి పేర్లను ఖరారు చేశారు. 28 ఏళ్లుగా పీఆర్‌టీయూలో విశేష సేవలందిస్తున్నందుకుగానూ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించడంపై వేమారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పవన్ రాజ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

స్వాతంత్య్ర సమరయోధుడు లింగమయ్య గౌడ్ మృతి


లింగమయ్య గౌడ్

జోగిపేట (అందోల్): జోగిపేట పట్టణానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు జి.లింగమయ్య గౌడ్ (96) మంగళవారం మృతి చెందారు. నవంబర్15, 1928లో జన్మించిన ఈయన అప్పటి స్వాతంత్య్ర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1947లో స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఏర్పడిన భారత దేశ ప్రభుత్వం నుంచి తామర పత్ర గ్రహీత అవార్డును అందుకున్నారు.1969లో జరిగిన ప్రత్యేక తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అప్పటి నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేపట్టారు. నిజాం సర్కార్ రైతులపై చూపించిన వివక్షకు వ్యతిరేకంగా చేపట్టిన తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా ఆయన పాలు పంచుకున్నారు. లింగమయ్య గౌడ్ చేసిన సేవలను గుర్తించి ప్రతీ ఏడాది ఆగస్టు 15న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయనకు సన్మానం చేశారు. లింగమయ్య గౌడ్ మృతిపై పట్టణంలోని పలువురు నాయకులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పరాజయాలే పాఠంగా..

డీఎస్సీ మూడో ర్యాంకు సాధించిన లక్ష్మీనారాయణ



పాపన్నపేట(మెదక్): పరాజయాలను పాఠాలుగా మలుచుకొని డీఎస్సీ మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మూడో ర్యాంకు సాధించాడు ఓ నిరుద్యోగ యువకుడు. పాపన్నపేట మండల నాగ్సాన్‌పల్లికి చెందిన లక్ష్మీనారాయణ నిరుపేద కుటుంబంలో జన్మించాడు. నాన్న కండక్టర్ గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. అన్న కిరాణం దుకాణం పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బీఎస్సీ, బీఈడీ చేసిన అతడు ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కలలు కన్నాడు. ఎన్నో పోటీ పరీక్షలు రాసి అపజయాలను మూటగట్టుకున్నాడు. కుటుంబీకులు, స్నేహితులు, గ్రామస్తుల దృష్టిలో ఫెయిల్యూర్‌గా ముద్ర వేసుకున్నాడు. అయినా కుంగిపోకుండా పట్టుదలతో చదివి చివరకు 2024 డీఎస్సీ మ్యాథ్స్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 74.20 మార్కులతో జిల్లా స్థాయి మూడో ర్యాంకు సాధించాడు.

నాడు మిస్సయినా నేడు ఉద్యోగం



మిరుదొడ్డి(దుబ్బాక): డీఎస్సీ ఫలితాల్లో మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు నాగ లక్ష్మి పెంటయ్యల కుమారుడు శ్రీకాంత్ సిద్దిపేట జిల్లాలోనే 2వ ర్యాంకర్ సాధించాడు. ఒకప్పటి డీఎస్సీలో కేవలం 0.2 మార్కుల తేడాతో ఉద్యోగం పోయింది. అయినా శ్రీకాంత్ నిరాశ చెందకుండా పట్టుదలతో చదివి ప్రస్తుత డీఎస్సీలో ఉద్యోగం సాధించి ఎందరికో ఆదర్శంగా నిలిచాడు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసిన శ్రీకాంత్ నెట్‌లో కూడా క్వాలిఫై అయ్యాడు. భవిష్యత్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వెల్లడించాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ రేటు, సిబిల్ అవసరం లేదు. NPA కూడ దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను.అర్పన్‌ఫైనాన్స్,పార్టీబా. 8500236824. [T-283]

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1185473]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించ వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అమ్మానాన్నల మాట.. సివిల్స్‌కు బాట



ప్రజాసేవ చేయడానికి కలెక్టర్ అయ్యా..

- ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సన్నద్ధం
- మూడోసారి 65వ ర్యాంకుతో ఐఏఎస్‌గా ఎంపిక
- తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది
- ఎంత కష్టం వచ్చినా లక్ష్యాన్ని మరువొద్దు
- ఉగాది పండుగంటే ఇష్టం
- ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం మనదే

- 'సాక్షి' ముఖాముఖిలో యువ కలెక్టర్ వల్లూరు క్రాంతి

టర్నింగ్ పాయింట్

చదువుకోవాలి.. చదువుకొని తన కాళ్లపై తాను నిలబడి, ఆదర్శంగా ఉండాలని చెప్పిన అమ్మ మాట.. సమాజంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజాసేవలో ఉండాలని చూపిన నాన్న బాట.. ఇలా తల్లిదండ్రులు చెప్పిన మాటలు ఆలోచనలో పడేశాయి. అప్పుడే తాను ఒక ఉన్నతాధికారిగా ప్రజాసేవ చేయాలని సంకల్పంతో 24 ఏళ్లకే ఐఏఎస్ సాధించారు. దేశంలోనే యువ ఐఏఎస్‌లలో ఒకరిగా నిలిచి పాలనలో పరుగులు పెట్టిస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సక్సెస్ స్టోరీ మీకోసం..

– సంగారెడ్డి జోన్:

బాల్యం.. విద్యాభ్యాసం

వల్లూరు క్రాంతి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌ని కర్నూలు పట్టణం. తండ్రి డా.రంగారెడ్డి, తల్లి డాక్టర్ లక్ష్మి. ఇద్దరూ కూడా వైద్యులే. అక్క కూడా వైద్యురాలే, అమెరికాలో స్థిరపడ్డారు. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు కర్నూల్‌లోనే చదువుకున్నారు. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుకున్నారు. బీటెక్ ఢిల్లీలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) లో మెకానికల్ ఇంజనీర్ పూర్తి చేశారు.

మూడో ప్రయత్నంలోనే..

అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ఓ వైపు వచ్చిన జాబ్‌ను వదలకుండా ఉద్యోగం చేసుకుంటూ సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యారు. తొలిసారిగా 2013లో సివిల్స్‌కు హాజరై 562 ర్యాంకు రావటంతో (ఐఆర్‌టీఎస్) ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌లో ఉద్యోగం వచ్చింది. అయినా నిరాశ చెందకుండా రెండోసారి 2014లో సివిల్స్ పరీక్ష రాసి 230 ర్యాంకు సాధించి, ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌లో ఉద్యోగం సాధించారు. ఐఏఎస్ కావాలని పట్టుదల, నాన్న సూచన సలహా మేరకు 2015లో జరిగిన సివిల్స్‌లో 65 ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపిక అయ్యారు. 24 సంవత్సరాలకే ఐఏఎస్ సాధించి యువ ఐఏఎస్‌గా నిలిచారు. ముస్సోరిలో ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసి, 2016 బ్యాచ్ తెలంగాణ క్యాడర్‌కు ఎంపిక అయ్యారు.

అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే..

ఇంట్లో అందరూ సైన్స్ పై ఎక్కువగా ఇష్టం.. తనకు మాత్రం మ్యాథ్స్‌పై ఇష్టం ఎక్కువ. తనకు చిన్నప్పటి నుంచే లీడర్ షిప్ లక్షణాలపై ఇష్టం. ప్రజలకు సేవ చేయాలనే తపన ఉండేది. ఒక ఉన్నత స్థానంలో ఉంటేనే ప్రజాసేవ చేయగలుగుతామనే ఆలోచన, చిన్నప్పటి నుంచి అమ్మ నాన్న చెప్పిన మాటలు మ్యాథ్స్ ఉన్న ఇంట్రెస్ట్‌తోనే ఐఏఎస్ సాధించేలా చేశాయి. ప్రైవేటుగా ఉండి ఎంత సంపాదించినా సరైన విధంగా ప్రజాసేవ సాధ్యం కాదు. అందుకే ఉన్నతమైన ఐఏఎస్‌ను సాధించడం జరిగింది. నిర్మల్ జిల్లాలో ట్రైనీగా, మహబూబ్ నగర్ జిల్లా ప్రత్యేక అధికారిగా, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్, జోగులాంబ కలెక్టర్‌గా నిర్వహించి ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా కొనసాగుతున్నారు.

శిక్షణలో క్షేత్రస్థాయి సమస్యలు

ముస్సోరిలో ఐఏఎస్ శిక్షణ తీసుకోవడం జరిగింది. శిక్షణలో భాగంగా వారం రోజుల పాటు ఓ గ్రామాన్ని సందర్శించడం జరిగింది. ప్రజాసేవలో ఎలా ముందుకు సాగాలో నేర్పించారు. అక్కడ క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకున్నాను. ట్రెక్కింగ్ నేర్పించారు.

కొత్త ఆశల ఉగాది అంటే ఇష్టం

పండుగలలో కొత్త ఆశ ఆశయాలతో ప్రారంభమయ్యే ఉగాది పండుగ అంటే నాకెంతో ఇష్టం. చదువుతోపాటు ఆటలు కూడా ఆడేవాళ్లం.

ప్రతీ విజయం వెనుక ఎంతో కష్టం

ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ముందుగానే ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలి. ఎంత కష్టం వచ్చినా నిరాశ చెందకుండా లక్ష్యం వైపు ముందుకు సాగాలి. లక్ష్యం సాధించే వరకు అదే పనిగా ఉంటూ ఆత్మస్థైర్యం, నమ్మకంతో ఉండాలి. ప్రణాళికబద్ధంగా సిలబస్ ప్రిపేర్ అవుతూ పరీక్షలకు సన్నద్ధం కావాలి. విజయం అనేది ఊరికే రాదు. ప్రతీ విజయం వెనుక ఎంతో కష్టం ఉంటుందనేది గుర్తు పెట్టుకోవాలి. పోటీ పరీక్షలు రాసే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలి.

భార్యాభర్తలిద్దరూ కలెక్టర్లు

వల్లూరి క్రాంతి సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. భర్త ఆశిష్ సంగ్వాన్ కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా కొనసాగుతున్నారు. వీరిద్దరిదీ ప్రేమ వివాహం. వీరికి పాప(ఆర్యన్) ఉంది.


భర్త ఆశిష్ సంగ్వాన్, కుమార్తె ఆర్యతో కలెక్టరు..

దొంగలు బీభత్సం

తాళం వేసిన ఇంట్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రాజు

వెల్దుర్తి(తూప్రాన్):గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇంట్లో చొరబడిన బంగారం, వెండి నగలు అపహరించిన ఘటన మండల కేంద్రం వెల్దుర్తిలో చోటు చేసుకుంది. బాధితులు, ఎస్ఐ రాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన సాయికుమార్ బస్టాండ్ సమీపంలో సెలూన్ నడుపుకుంటూ మొదటి అంతస్తులో నివాసముంటున్నాడు. సాయంత్రం వరకు షాపులో ఉండి గ్రామంలో మరోచోట ఉంటున్న తల్లిదండ్రుల వద్ద రాత్రిపూట నిద్రిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి దొంగలు సాయికుమార్ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నాలుగున్నర తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ.4 వేలు నగదు అపహరించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రాజు, క్లూస్ టీమ్ సిబ్బంది సందర్శించి పంచనామా నిర్వహించారు.

ఎల్లమ్మ ఆలయంలో వెండి కిరీటం

జహీరాబాద్: అల్గోల్ గ్రామంలో గల ఎల్లమ్మ ఆలయంలో దేవికి అలంకరించిన 25 తులాల వెండి కిరీటాన్ని సోమవారం రాత్రి దుండగులు ఎత్తుకెళ్లారు. హుండీని సైతం పగులగొట్టి నగదును అపహరించారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు..

జహీరాబాద్ టౌన్: గుర్తు తెలియని వ్యక్తులు మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కర్దాస్ తుల్జమ్మ అనే మహిళ సాయిరాం నగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటుంది. దసరా పండుగ సందర్భంగా మంగళవారం మనుమరాలితో కలిసి పట్టణంలోనే షాపింగ్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి కాలినడక వస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వెనుకాల నుంచి తుల్జమ్మ మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు.ఈ మేరకు జహీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

ఐదుగురు అరెస్టు, రూ.60,270 స్వాధీనం

కొమురవెల్లి(సిద్దిపేట): ఓ పేకాట స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి స్థానిక పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగుని అరెస్టు చేశారు. ఈ ఘటన కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోసాన్‌పల్లి శివారులో జగ్గన్నగారి శంకర్‌గౌడ్ షెడ్డులో కొంత మంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశారు. పేకాట ఆడుతున్న వైరం రాజు, వేముల కృష్ణ, గంగాదేవి వెంకటేశ్, గుగులోత్ వెంకటేష్, మహమ్మద్ నిజామ్‌ను అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ 60,270 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత


ఆటోల వద్ద డీటీసీఎస్, విజిలెన్స్ అధికారులు


పట్టుబడ్డ ఆటోలు

నర్సాపూర్:అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు డీటీసీఎస్ ప్రణీతారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. తూప్రాన్‌కు చెందిన నాగరాజు తన దుకాణం చుట్టుపక్కల ఉన్న ప్రజలు తెచ్చే రేషన్ బియ్యం తీసుకొని వాటి విలువ మేరకు కావాల్సిన సరుకులు ఇచ్చేవాడు. దుకాణంలో సేకరించిన బియ్యాన్ని శివ్వంపేట మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీల్లో పని చేసే కూలీలకు విక్రయిస్తాడు. మంగళవారం 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తీసుకొని కొంతాన్‌పల్లి శివారులోని రైసుమిల్లు వద్దకు రాగానే ఆటోను పట్టుకొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. రైసుమిల్లులో తనిఖీ చేసి 60 సంచుల్లో బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, బియ్యం రేషన్ దుకాణాలకు సంబంధించినవా.. కాదా అనేది పరీక్షల్లో తేలుతుందని ప్రణీతారెడ్డి తెలిపారు.

నంగునూరు(సిద్దిపేట): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసీఫ్ కథనం మేరకు.. ఖాత గ్రామంలో సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రాజపేట మండలానికి చెందిన బుక్యా శ్రీను, మాడోత్ శ్రీను ట్రాలీ ఆటోలను తనిఖీ చేశాం. అందులో 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించాం. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ లావణ్య ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆరు క్వింటాళ్లు స్వాధీనం..

కోహెడరూరల్(హుస్నాబాద్): అక్రమంగా తరలిస్తున్నరేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని నాగసముద్రాల గ్రామానికి చెందిన పర్వతం సారయ్య ఇంట్లో ఎలాంటి అనుమతులు లేకుండా 6 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు గుర్తించాం. ఆయన మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాడు. ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్మి లాభాలు ఆర్జించడానికి నిల్వ ఉంచడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మూఢ నమ్మకాలపై చైతన్యం చేస్తాం


కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో జన విజ్ఞాన వేదిక సభ్యులు

- రెండో వారం నుంచి జిల్లాలో అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్, ఎస్పీలను కలిసిన జన విజ్ఞాన వేదిక సభ్యులు

మెదక్ కలెక్టరేట్/మెదక్ మున్సిపాలిటీ: మూఢ నమ్మకాలపై జిల్లా ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు రాజేశ్వర్ తెలిపారు. మంగళవారం మెదక్‌కు వచ్చిన జన విజ్ఞాన వేదిక సభ్యులు కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డిలను కలిశారు. అనంతరం వేదిక అధ్యక్షుడు చలిమల రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలో జరిగిన కొన్ని మూఢ నమ్మకాల ఘటనలను దృష్టిలో పెట్టుకొని జన చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని డీజీపీ సూచనలు చేసినట్లు తెలిపారు. ఈనెల రెండో వారం నుంచి జిల్లాలో మూఢనమ్మకాలపై జన చైతన్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్, ఎస్పీలను కలిసి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశామన్నారు. సమాజంలో పెరుగుతున్న మూఢ నమ్మకాలపై సామాన్య ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తామన్నారు. జీవితంలో సైన్స్ యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు కుల సంఘాలు, గ్రామ పెద్ద మనుషులు సహకరించినప్పుడే మూఢ నమ్మకాలను పూర్తిగా రూపు మాపవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర ప్రసాద్, మహేందర్, జిల్లా నాయకుల దేవ్లా, జేవీవీ రాష్ట్ర మహిళా నాయకురాలు చలమల పద్మ, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

ముగిసిన 'బ్యాగ్‌లెస్ డే'

వర్గల్(గజ్వేల్): క్షేత్రసందర్శన, నర్సరీలు, డ్రిప్ సిస్టమ్ పరిశీలన, ప్రముఖుల మోటివేషన్ తరగతులతో విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గిస్తూ కొనసాగిన వర్గల్ నవోదయ విద్యార్థుల ఐదు రోజుల బ్యాగ్‌లెస్ డే కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుకు విరామమిచ్చారు. బ్యాగులను పక్కకు పెట్టేశారు. గోడలపై చిత్రాలు వేశారు. మట్టితో బొమ్మలు తీర్చిదిద్దారు. డ్యాన్స్‌చేశారు. మొక్కలు నాటి, ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. మ్యూజిక్ ప్రాక్టీస్ చేశారు. ముగింపు రోజు పూర్వ విద్యార్థి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి విద్యార్థులతో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పండుగకు ఇంటికొస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి

బైక్ అదుపుతప్పి గుంతలో పడ్డ వ్యక్తి


లక్ష్మయ్య(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): బతుకుదెరువు కోసం పట్నం వెళ్లిన వ్యక్తి పండుగకు ఇంటికొస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కొత్త చెరువు తండా పంచాయతీ మొండి తండా సమీపంలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట గ్రామానికి చెందిన చీమల లక్ష్మయ్య(49) భార్యాపిల్లలతో కలిసి మూడేళ్ల కిందట బతుకుదెరువు కోసం గండిమైసమ్మ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడే పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దసరా పండుగ సందర్భంగా సోమవారం రాత్రి బైక్‌పై ఇంటికొస్తున్నాడు. మొండితండా సమీపంలోనికి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయాడు. గమనించిన తండావాసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బాధితుడిని ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ..

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. వర్గల్ మండలం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. శాకారం గ్రామానికి చెందిన పంగ సత్తయ్య(50) ఆదివారం రాత్రి వర్గల్ నుంచి గ్రామానికి నడుచుకుంటూ వస్తున్నాడు. అదే మార్గంలో బైక్ మీద వస్తున్న మీనాజీపేటకు చెందిన బర్రెంకల నర్సింలు వెనుక ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన సత్తయ్యను ఆర్వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి..


సూరమ్మ (ఫైల్)

దుబ్బాకటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మంగళవారం రాయపోల్ ఎస్సై రఘుపతి కథనం మేరకు.. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన రాసమల్లు సూరమ్మ (55) రాయపోల్ మండల కేంద్రంలో బంధువులు మృతి చెందగా మూడు రోజుల కార్యక్రమానికి వచ్చింది. బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్లే క్రమంలో లింగారెడ్డి పల్లి గ్రామ శివారులోకి రాగానే కింద పడింది. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం సూరమ్మను ఢీకొని పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మద్యం తాగి రహదారిపై పడి వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: మద్యం తాగి రహదారిపై పడి తీవ్రగాయాలతో వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్రకు చెందిన సంజయ్ (50) పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ తేజకాలనీలో ఉంటూ స్థానికంగా కూలీ పని చేసేవాడు. సోమవారం మద్యం తాగి స్థానికంగా ఉన్న మహాలక్ష్మి షాపింగ్ మాల్ వద్ద రహదారిపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

జగదేవ్‌పూర్(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అలిరాజ్‌పేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మర్కూక్ మండలం నర్సన్నపేట గ్రామానికి చెందిన ఎంబరి బాల్‌నర్సు(49) మంగళవారం సాయంత్రం బైక్‌పై పని నిమిత్తం జగదేవ్‌పూర్‌కు వచ్చాడు. తిరిగి వెళ్తున్న క్రమంలో అలిరాజ్‌పేట గ్రామ శివారులోని మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని కిందపడిపోయాడు. తీవ్రగాయాలైన అతడిని ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బావిలో పడి వృద్ధుడు..

మద్దూరు(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని తోర్నాల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. యాకోజు చంద్రయ్య(75) కొద్ది రోజులుగా మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతున్నాడు. మంగళవారం ప్రమాదవశాత్తు గ్రామంలోని ఓ బావిలో పడిపోయాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం చంద్రయ్య మృతదేహాన్ని బావిలో నుంచి బయటికి తీశారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

రెండు కార్లు ఢీ.. ఆరుగురికి గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు కార్లు ఢీకొనడంతో ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన 765డి జాతీయ రహదారిపై ముంత్రాయిగేట్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. చిలప్‌చెడ్ మండలం రాందాస్‌గూడ గ్రామానికి చెందిన అంజయ్య కారులో కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగొస్తున్నాడు. అలాగే హైదరాబాద్‌కు చెందిన చిదానందం కుటుంబ సభ్యులతో కలిసి కారులో ఏడుపాయలకు వెళ్లి తిరిగి ఇంటికెళ్తున్నాడు. ముంత్రాయిగేట్ వద్దకు రాగానే రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అంజయ్య, గాయత్రీ, లావణ్య, విష్ణులతో పాటు మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య


కరుణాకర్ మృతదేహం

నర్సాపూర్ రూరల్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుండె కర్ణాకర్ (35) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఏడాది కిందట కూతురి వివాహానికి అప్పులు చేశాడు. అవి తీర్చలేక కుటుంబ సభ్యులతో చెబుతూ బాధపడేవాడు. మంగళవారం భార్య కూలీ పనికి వెళ్లగా ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సంతోష, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఐ అభిలాష్ మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు గ్రామ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్ యాజమాని శివరాత్రి అశోక్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.